# సన్మానం

జాతశ్రీ

వయసు రీత్యా పెద్దవాడైనంత మాత్రానే నేను రామశర్మగారిని 'గురూజీ' అని సంభోదించడం లేదు. గురూజీ అని గౌరవించడానికి వారికున్న అర్హతల జాబితా విప్పితే తెలీని వాళ్లు 'చెవిలో పువ్వు పెట్టకు' అనొచ్చు. అయినా నిజం-నిలువుటద్దం!

అమోఘమైన బోధనా పటిమ, అరటిపండు వొలిచినంత తేలికగా విషయ విశ్లేషణ, విద్యార్థుల్ని అలవోకగా ఆకట్టుకునే వాక్చాతుర్యం..

విషయమేదైనా సందర్భోచితంగా బహు భాషల్లో అనర్గళంగా



ఉపన్యశించగల ధీశాలి.

గురూజీ కవితల్ని ప్రచురించని పత్రికా, వారి ఉపన్యాసాల్ని ఆహ్వానించని వేదికా ఆంధ్రదేశంలో అరుదుగా వున్నాయి. ప్రవాసాంధ్రులు సైతం వారిని ఆహ్వానించి సన్మానించిన సందర్భాలనేకం.

గురూజీ తనను గుర్తించి, గౌరవించే సాహిత్యాభిమానుల్ని, సంస్థల్ని మనసారా అభినందించడం, ఆకాశం హద్దుగా శ్లాఘించడం (కొన్నిసార్లు, పొగడ్తలుగా అనిపించినా) ఆ సందర్భాల్లో వారికి ఆనందాశ్రువులు రప్పించిన ఘటనలు కూడా లేకపోలేదు.

మా జిల్లాలో ఏ సాంస్కృతిక కార్యక్రమంగానీ గురూజీ ఆశీస్సులతో ఆరంభించడం ఒక ఆనవాయితీ. ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యక్రమం ఏదైనా గానీ వారు ముందు వరసలో ఉండాల్సిందే. చెప్పొద్దూ... ఈ ఆనవాయితీ వెనుక గురూజీ హస్తం కూడా కొంత మిళితమై వుంటుంది. వారిలోని కళాతృష్ణ అలాటిది మరి. ఎక్కడ ఏ సభ జరిగినా తదనుగుణ కవితా సరంజామాతో హాజరై, ఆశీస్సు పలకడం వారి అలవాటు. ఆహ్వానం లేకపోయినా, ఆహ్వానించారని మా బోటి బుడతల దగ్గర బడాయి పోతాడని, స్వోత్కర్ష మరీ ఎక్కువనీ, అవసరానికి కులాన్నీ, రాజకీయ గుణాల్నీ ప్రయోగించి, తాననుకొన్న రీతిన విషయాన్ని నరుక్కొస్తాడనీ... కొందరంటారు గాని మేమది పరిగణనలోకి తీసుకోము.

గురూజీని ఆహ్వానిస్తారో లేదో మాకనవసరం గాని, రచయితలుగా మేం గర్వించే విషయమేమంటే ... గురూజీ పాదం మోపిన ప్రతిచోటా వారికి నిస్సంకోచంగా అగ్రాసనం యివ్వడం. పైగా సముచిత రీతిన సన్మానం, ఉచిత రీతిన గురూజీ చేతిలో ఓ కవర్ ఉంచడం మాకు ఆధిక్యం లభించినంత ఆనందంగా వుండేది.

సన్మానాల స్థాయికి సాహిత్యం ఎదగడం ఆహ్వానించదగినదే గానీ, సాహిత్యకారుడు 'ఎగ్రబాకితే' మాత్రం అతని ప్రతిభ అధోమార్గానికి మళ్లినట్టేనని అనుభవజ్ఞుల ఉవాచ నిజమేననిపిస్తుంది. కాకపోతే గత పుష్కరకాలంలో ఏనాడూ నాకిది కావాలని అడగని గురూజీ ''మీ యువ రచయితల సంఘ పక్షాన పెద్దవాళ్లను సన్మానించడం నేర్చుకోండి. మంత్రిగారిని రప్పించే బాధ్యత నాది. సన్మానం నాకే కాబట్టి విరాళాలు కూడా భారీగా అందేలా చూస్తాను. మీకూ ఓ గుర్తింపు వస్తుంది కదా'' అని నిర్మొహమాటంగా ఎలా చెప్పగలరు?

''గురూజీ సన్మానం కోసం అవురావురుమంటున్నారు, కానిస్తే ఓ పనైపోద్దిగా'' అని మా సంఘంలోని కొందరు ముందుకొచ్చారు.

కళాకారులకు ఈ 'అవురావురు'మనే దశ ఒకటుంటుందేమోనని నాక్కూడా అన్పించింది. సన్మానాల తాకిడి సామాన్యమైనదేమీ కాదు. అదో నిండు గోదావరి వరద. ఆ వరదలో చిక్కుకుంటే ఆ ఉరవడికి బురదమయమై, తనకే తెలీని తీరాలకు కొట్టుకుపోకుండా ఎవరైనా ఉండగలరా? గురూజీ మానవాతీతుడేం కాదుగదా.

మేమేం ఇద్దై పోలేదు. గత కొంత కాలంగా సాహితీ కీకారణ్యంలో దారి తెలీక తారాడే మమ్ముల్ని చేయిపట్టుకు నడిపించిన గురూజీని ఘనంగానే సన్మానించాము. ఓ పత్రికా సంపాదకున్నీ, మంత్రిగారినీ ఆహ్వానించాము. మంత్రిగారి చేతులమీదుగా ఓ నవరత్నాల ఉంగరాన్నీ బహూకరించాము.

గురూజీ ఆ సభలోనే తన కంచుకంఠాన్ని సవరించుకొని, ఆశువుగా కొన్ని పద్యాలతో మంత్రిగారిని స్తోత్రించి, ఆపై అనర్గళంగా మధ్య మధ్య పార్సీ, ఉర్దూ, ఆంగ్ల రచయితల్ని ఉదహరిస్తూ, 'రచయితలు సామాజిక రూపకర్తలు' అంటూ ఉపన్యసించి, ముక్తాయింపుగా 'ఇహ నేను చెప్పాల్సిందంతా చెప్పేసాను. రాయాల్సిందంతా రాసేసాను. మిగిలిందేమయినా ఉంటే నా వారసులైన ఈ యువ రచయితలకు వదిలేస్తున్నానన'నిచెప్పి రాయని భాస్కరుల జాబితాలోకి చెక్కేశారు.

అయినా సాధించిన విజయాలు సామాన్యంగా వదలవుగదా. జిల్లాలో జరిగే సదస్సులకూ, పాఠశాలల వార్షికోత్సవాలకూ హాజరవుతూ.. తన గత కాలపు వైభవాలను ఉగ్గడిస్తూ, సాహిత్యకారునిగా తన ఉనికికి ఢోకా లేకుండా సమయానుకూలంగా సన్మానాలందుకుంటూ అదోరకం సాహిత్యోపాసన!

* * *

ప్రపంచం పరిణామ శీలి!

ఆ పరిణామాల ప్రభావాల కనుగుణంగానే సామాజిక, ఆర్థిక రంగాలు గమిస్తుంటాయి. ఆ గమనానికి అనువుగా మానవ సంబంధాల్లో అనూహ్య, అనిర్వచనీయ మార్పులు... నిజాలూ, నీడలూ కలగా పులగమై.. వ్యక్తిత్వాలూ, వ్యక్తిగతాలూ బహుముఖ రంగుల్నీ, రుచుల్నీ సంతరించుకొంటాయి.


గత పదేళ్లుగా సాంకేతిక రంగం సామాజిక రంగంతో ఆడుకుంటూంది. కంప్యూటర్ మనిషి జీవితంలోకి జొరబడి, కొత్త విలువల్నీ, పోకడల్నీ ప్రతిపాదిస్తూవుంది. గతం లో వెండితెర వెలుగులోకి వచ్చి, ఆనాటి వరకూ సామాజిక రంగాన్ని అలరించిన జానపద కళారూపాల్ని ఎలా అణగదొక్కిందో అలానే ఇవాళ - 'ఎలక్ట్రానిక్ మీడియా' సాహితీ సాంస్కృతిక రంగాలను నిర్దయగా అణగదొక్కుతూంది. టివి నిత్యావసర వస్తువుల జాబితాలో చేరిపోయింది. కళారూపాలకూ, కళా వేదికలకూ పోషణ కరువయింది. కళా పరిషత్తులు మాయమయ్యాయి. పుస్తక పఠనాభిలాష కుంటుపడింది. సాహితీ, సాంస్కృతిక సంస్థల కార్యక్రమాలకు ప్రేక్షకులు పలుచనయ్యారు.



## మల్లెలాంటి మనసున్న 'మామ'

'ఉపాయంలో అపాయం' అని 1967లో ఒక సినిమా వచ్చింది. టీవీ ఛానెల్స్ క్రమం తప్పకుండా చూసే ఈతరం ప్రేక్షకులు కూడా ఆ సినిమా చూసేవుంటారు. కొందరు మిత్రులతో కలిసి నల్లగొండకు చెందిన వెంకురెడ్డి అనే ఆసామి ఆ సినిమా తీశారు. ఆదుర్తి సుబ్బారావు దగ్గర ఎడిటర్‌గా పని చేస్తున్న టి. కృష్ణకు ఆ సినిమాతో డైరెక్టర్ ప్రమోషన్ ఇచ్చారు నిర్మాతలు. అప్పట్లోని రెండోతరం తారలు చాలామందిని పెట్టి తీసిన సినిమా అది. కారణాలు ఏమైతేనేం సినిమా ఆలస్యమయింది. ఎలాగోలా మొత్తంమీద సినిమా పూర్తిచేశారు. విడుదలయింది. కానీ అంత బాగా పోలేదు. తారలు, సాంకేతిక నిపుణులకు పారితోషికాల చెల్లింపులకు సంబంధించి ఇప్పుడంటే ఇన్ని నిబంధనలు అమల్లోకి వచ్చాయి కానీ ఆరోజుల్లో అవేమీ లేవు. నిర్మాత తనకు బకాయి వున్నాడంటూ ఫిర్యాదు పత్రం ఇచ్చి లాబ్ దగ్గర ప్రింటు ఆపుచేయించే పద్ధతి ఆనాడు లేదు. దక్షిణ భారతదేశ చలనచిత్ర పరిశ్రమ యావత్తూ 'మామ' అని ఆప్యాయంగా పిలుచుకున్న మహదేవన్ ఆ సినిమాకు సంగీత దర్శకుడు. రీ-రికార్డింగ్ సమయంలో చివరి విడతగా ఆయనకు ఇవ్వవలసిన ఐదువేల రూపాయలు వెంకురెడ్డి సర్దుబాటు చేయలేకపోయారు. సినిమా బయటపడిపోయింది కాబట్టి ఇక ఎవరి మొహం చూడవలసిన పనిలేదని చంకలు గుద్దుకునే ఇప్పటితరం కాదది. తనకు కాస్త డబ్బు సర్దుబాటు అయ్యాక ఐదువేలూ తీసుకుని మామ ఇంటికి వెళ్లారు వెంకురెడ్డి. ఉభయకుశలోపరి అయ్యాక వచ్చిన పని చెప్పి మామకు రొక్కం ఇవ్వబోయారు. సినిమా బాగా పోలేదని మామకు తెలుసు. ''నువ్వు నిర్మాతవు. నేను సంగీత దర్శకుడిని. కాదనను. మన ఇద్దరి అనుబంధం అంతవరకే అనుకుంటే ఆ డబ్బు అక్కడ పెట్టి వెళ్లు'' అన్నాడు మామ. ఆయన మంచి మనసుకు కదిలిపోయారు వెంకురెడ్డి. ''నీ మంచి మనసుకు ఈ ఐదువేలతో ఖరీదు కట్టి నన్ను నేను కించపరచుకోలేను. క్షమించు మామా'' అంటూ వెళ్లిపోయారు వెంకురెడ్డి. మల్లెలాంటి మంచి మనసున్న మామకు ఈ పరిశ్రమ ఎప్పటికీ దాసోహం.

సేకరణ: కౌముది



## ఆధునిక ఈక్వేషన్స్

ఇంజనీరింగ్ డిగ్రీ + యంబిఏ డిగ్రీ = నిరుద్యోగం
ఓ ఐడియా + ఓ ఇడియట్ = డాట్‌కామ్
స్విట్జర్లాండ్ + కెనడా + అమెరికా + ఇంగ్లండ్‌లో నాలుగు వారాలు = 4 నిముషాల హిందీ సినిమా పాట
అమితాబ్ బచ్చన్ + కౌన్ బనేగా కరోడ్‌పతి – మృత్యుదత్త = సూపర్‌స్టార్
అమితాబ్ బచ్చన్ + జయాబచ్చన్ – అభి షేక్ బచ్చన్ = నటనాచాతుర్య
ఒక చిరునవ్వు + 32 ఏళ్ళు = గోవింద
ఓ కొత్తనటి + ఓ కొత్తనటుడు + ఓ కొత్త సంగీత దర్శకుడు = తెలుగులో వచ్చిన ప్రేమ సినిమాల్లో ఒకటి
* నటనా చాతుర్యం + కాస్మొటెక్ సర్జరీ + అందం + పర్సనాలిటీ = శ్రీదేవి
* వాణిశ్రీ – 15 కిలోలు + నటనా చాతుర్యం = జయసుధ

– పృథ్వీరాజ్

చుట్టూ ఆవరించిన చీకటిని చూస్తూ రోదించే కంటే ప్రయత్నించి చిన్న కొవ్వొత్తినైనా వెలిగించమన్న పెద్దల సూక్తిని ఔదాల్చి, మా యువ రచయితలం కలిసి స్తబ్దతకు లోనౌతున్న సాహితీ రంగాన్నీ, తెరమరుగవుతున్న పుస్తక పఠనాభిలాషనూ బతికించుకునేందుకు నిర్ణయించుకొన్నాం. ఆర్నెళ్ళకో జిల్లాస్థాయి సాహితీ సదస్సు, నెలకోసారి కవి, కథక సమ్మేళనం, ప్రతి ఆదివారం సాయంత్రం నచ్చిన కొత్త పుస్తకంపై చర్చ వగైరా కార్యక్రమాలతో మా పరిధిలో సాహితీ వాతావరణాన్ని పాదుకొల్పాలనుకొన్నాం. గురూజీ సలహా కోసం ఓ చిత్తు ప్రణాళికతో వెళ్ళాం.

ఎప్పటిలా గురూజీ వెంటనే బయటకు రాలేదు. ఓ అరగంట ఎదురు చూసాక వస్తూ ''తీరుబడి లేదోయ్.. మొన్న ఖమ్మంలో సన్మానానికి వెళ్ళి, ఈ ఉదయం వచ్చానా! ఆ ప్రయాణ బడలిక యింకా తీరనేలేదు. మళ్ళీ ఫోన్.. ఇవాళ రాత్రికే ప్రయాణం..'' మా నమస్కారాలూ, పాద పూజనూ అందుకుంటూ అన్నారు గురూజీ.

''ఎక్కడికి గురూజీ?''

''హస్తినకు. అక్కడి ఆంధ్రా అసోసియేషన్ వాళ్ళు సన్మానం చేస్తామని ఆర్నెల్లుగా అడుగుతున్నారు. ఇప్పటికి వీలయింది. ఐదో తేదీన సన్మానం. సత్యనారాయణ గారని... మంచి సాహితీ పిపాసి. హస్తిన ఆంధ్రా అసోసియేషన్ సెక్రటరీ. వారి పోరు పడలేక ఒప్పుకున్నా. ఈ రాత్రే వెళ్లాలి. తప్పదు మరి'' అని, ఆగి అందర్నీ ఓ మారు చూసి, ''ఇంతకూ మీరొచ్చిన పని?... ఏమోయ్.. కొత్త కథేదయినా రాశావా? రాయాలోయ్.. సమాజం లోతుల్లోకి చూస్తూ రాయాలోయ్'' అంటూ జుట్టు వెనక్కి నెట్టుకున్నారు. అలా నెట్టుకోవడం వారి అలవాటు.

అలా నెట్టుకునేప్పుడు వారి ఉంగరపు వ్రేలికి మేము బహూకరించిన నవరత్నాల ఉంగరం తళుక్కున మెరిసింది.

సాయంత్రం ప్రయాణం పెట్టుకున్న గురూజీతో సదస్సు గురించి చర్చించి, చికాకు పర్చడం నచ్చక 'ఢిల్లీ నుంచి వచ్చాక కలుస్తా'మని చెప్పి నమస్కరిస్తూ సెలవు తీసుకున్నాం.

పదిరోజులు గడిచాయి.

గురూజీ ఢిల్లీ నుంచి వచ్చారని తెలిసి, వారిని అభినందించి పనిలో పనిగా సదస్సు గురించి చర్చించేందుకు వెళ్లాము. గురూజీ మడత కుర్చీలో కూర్చుని ఉన్నారు. భుజం మీద కొత్త శాలువా ఉంది. మమ్మల్ని చూస్తూనే ఆహ్వానించారు. ఒక్కొక్కరమే వంగి వారి పాదాలను తాకుతూ నమస్కరించాం. కుశల ప్రశ్నలయ్యాక ఢిల్లీ సన్మాన విశేషాలు చెప్పసాగేరు..

''సభ చాలా ఘనంగా జరిగిందోయ్. హస్తినలో నున్న అన్ని ఆంధ్రా అసోసియేషన్‌లూ కలిసొచ్చాయి. ఒకరిద్దరు కేంద్రమంత్రులూ వచ్చారు. విజ్ఞాన భవన్ కిక్కిరిసి పోయింది. ఇదిగో ఈ శాలువా వారిదే. నాకు జీవితాంతం గుర్తుండే సన్మానాల్లో అదీ వొకటి. 'ఈ జన్మ కిక చాలు' అన్పించిందంటే నమ్మండి'' అంటూ అలవాటుగా జుట్టును వెనక్కి నెట్టుకున్నారు. అలా నెట్టుకునేప్పుడు గురూజీ ఎడమచేతి ఉంగరపు వ్రేలు బోసిగా ఉండడం గమనించాను.

''ఉంగరం తీసేశారేం గురూజీ'' అడగాలనుకున్నానుగాని, పెదాలు కలిసి రాలేదు.

''ఆ... సన్మానాలు నాకు మామూలేగాని, యింతకూ మీరొచ్చిన పని...'' అన్నారు.

మా సహచరుడొకడు మా ఆలోచనంతా ఒక క్రమంలో వివరించాడు. మేం తయారు చేసిన చిత్తు ప్రణాళికనూ అందించాం.

''మంచిదే.. మంచి ఆలోచన. కారణాలేమయినా 'ప్రస్తుతం తెలుగు సాహిత్యం క్షీణ యుగంలో వుందా? అన్పించేంత దీన స్థితిలో ఉంది' అయితే... నన్ను మన్నించాలి. రెండురోజులాగి రండి. విపులంగా సాధక బాధకాలన్నీ చర్చించు కొందాం... ప్రస్తుతం చిన్నపని, రహస్యమేమీ కాదులెండి. భద్రాచలంలో రేపు గిరిజన కళాకారుల వార్షిక మహోత్సవముంది. గిరిజన కళలపై ఉపన్యసించమన్నారు. కాస్త ప్రిపరేషన్ అవసరమనిపిస్తుంది. వాళ్లు సన్మానమూ, సత్కారమూ అంటూ ఏదో హడావుడి చేస్తున్నారని ఐటిడిఏ పిఓ గారు ఫోన్ చేశారు.

వద్దన్నా అభిమానులు ఆగరుగా. తప్పదు మరి'' అంటూ లేచారు గురూజీ.

వచ్చిన పని వాయిదా పడినందుకు బాధేసింది. ఉన్న ఆసక్తి కాస్తా ఎక్కడ అణగారిపోతుందోనని... అయినా తప్పదు. సాహిత్యమేమన్నా అధికారమా? రచయితలేమన్నా ప్రజాప్రతినిధులా? అనుకున్నవన్నీ టకటకా జరగడానికి? సమాజానికీ తనకూ పొత్తు కుదరని అమాయకుల ఆవేశం- సాహిత్యం!

నాలుగు రోజులాగి మళ్లీ అందరం కలిసి గురూజీ దగ్గరికెళ్లాం. గురూజీ స్నానం చేస్తున్నారు. వారి శ్రీమతి- మా అందరికీ అమ్మ- కూర్చోమని చెప్పి పేరు పేరునా యోగక్షేమాలడిగింది. మాటలో మాటగా ''మీ గురూజీ గత పదిరోజులుగా విశాఖలో పెద్దమ్మాయి దగ్గరున్నారా? మళ్లీ ఇప్పుడు చిన్నమ్మాయి దగ్గరికెళ్తానని ఒకటే నస. ఈ వయసులో ప్రయాణాలు ఎంత కష్టం. మీరయినా చెప్పండి'' అని లోనికెళ్లింది.

మేం ఆశ్చర్యంతో ఒకరినొకరం చూసుకున్నాం. వాస్తవాన్ని వెంటనే జీర్ణించుకోలేకపోయాం. ఢిల్లీ సన్మానం ఒక కల్పన అని తెలిసినా ఆ విషయాన్ని కెలికి గురూజీని ఇరకాటంలో పెట్టదల్చుకోలేదు. గొప్పతనాలతో పాటు బలహీనతలూ వుంటాయి. పంటచేలో కలుపు మొక్కలున్నాయని పంటను కాల్చేసుకోముగదా!

గురూజీతో అవసరమైన విషయాలనే చర్చించి, నమస్కరిస్తూ బయటపడ్డాం.

మేం బహూకరించిన నవరత్నాల ఉంగరం ఏమయిందో తెలిసిపోయింది. ప్చ్!! ★